

మహిళలకు చెక్కును అందజేస్తున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

# సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే
- సల్కర్‌పేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

బిజినేపల్లి, జనవరి 19 : మారుమూల గ్రామాల్లోని పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌పాండే తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని సల్కర్‌పేటలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 17 శాతం రైల్వే విస్తరణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారన్నారు. త్వరలోనే నాగర్‌కర్నూల్ జిల్లా మీదుగా రైలుమార్గాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో హైవేల విస్తరణ కోసం ఇప్పటివరకు రూ.1.02 లక్షల కోట్లను ఖర్చు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలోనూ ఆయుష్మాన్ పథకం అమలు చేస్తున్నామన్నారు. యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 12 లక్షల మందికి ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్లను ఉచితంగా అందించినట్లు వివరించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ సంకల్ప యాత్ర విజయవంతంగా సాగుతుందన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు చెక్కులను అందజేశారు. అంతకు ముందు స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, యూనియన్ బ్యాంక్ బీజీఎం సత్యనారాయణ, డీఆర్‌డీఏ నర్సింగరావు, నాబార్డు డీడీఎం అఖిల్, ఎల్‌డీఎం కౌశల్ కిశోర్‌పాండే, డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, దిలీపాచారి, సర్పంచ్ చంద్రకళ, రాములు, ఎంపీటీసీ అంజి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి రజతోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు

# భక్తితోనే ముక్తిమార్గం

- ప్రతి ఒక్కరూ ధార్మికచి ంతననుఅ లవర్చుకోవాలి
- కొల్లూరులోధర్మ జాగృతిసభనిర్వ హించడంఅ భినందనీయం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

నవాబ్‌పేట, జనవరి 19 : మానవుడికి భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని కొల్లూరులో ఏర్పాటు చేసిన చింతలపురి చిన్మయ స్వామి మఠం రజతోత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆలయ ముఖద్వారాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధార్మిక చింతన కలిగి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మారుమూల గ్రామమైన కొల్లూరులో పెద్ద ఎత్తున ధర్మ జాగృతి సభను నిర్వహించడంతో మఠాధిపతి నందీశ్వర స్వామిని అభినందించారు. చిన్మయస్వామి మఠం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం శ్రీశైలం పీఠాధిపతి 1008వ జగద్గురు శివాచార్య మహాస్వాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని కోరారు. జీవహింస చేయొద్దని, భక్తి భావంతో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, రాజేశ్‌రెడ్డి, సర్పంచ్ సౌజన్య, ఉపసర్పంచ్ నర్సింహాచారి, నాయకులు దుశ్యంత్‌రెడ్డి, రవి, జహీర్‌అక్తర్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, రాజు, రఘు, నీల్యానాయక్, ఖాజా, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తప్పిన పెను ప్రమాదం

- ఊడిపోయిన వోల్వో బస్సు టైరు
- డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపివేత
- అంటుకున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చిన డ్రైవర్లు
- ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు..





ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

మూసాపేట (అడ్డాకుల), జనవరి 19 : బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ వోల్వో ఏసీ బస్సు టైరు ఊడిపోగా.. ఒక్కసారిగా మంటలు రావడంతో బస్సు డ్రైవర్లు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికుల కథనం మేరకు.. సీఎంఆర్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో ఏసీ బస్సు (ఏపీ 39 యూక్యూ 8584) గురువారం రాత్రి 7:30 గంటలకు బెంగళూరు నుంచి 30 మంది ప్రయాణికులతో బయలుదేరింది. కర్నూల్ దాటిన తరువాత బస్సు వేగం పెరిగిన క్రమంలో షేక్ అవుతున్నట్లు డ్రైవర్ రాజు గమనించి మరో డ్రైవర్‌కు చెప్పాడు. అయితే శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బస్సు ముందు భాగంలో కుడి వైపు ఉన్న టైరు పూర్తిగా ఊడిపోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. టైరు ఊడిపోయినా బస్సు ముందుకు వెళ్లడంతో నిప్పులు వచ్చాయి. డ్రైవర్లు రాజు, వినయ్, హెల్పర్ కలిసి మంటలు విస్తరించకుండా అదుపులోకి తీసుకొచ్చారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ప్రయాణికులను వేరే బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

## ముగ్గురు వైద్యుల టెర్మినేట్

మక్తల్ టౌన్, జనవరి 19 : విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు వైద్యులను టెర్మినేట్ చేసినట్లు నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మక్తల్ నియోజకవర్గం మాగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రాజేశ్ (చేగుంట), డాక్టర్ నాగరత్నం (కృష్ణ), డాక్టర్ నరేశ్ (కున్సి) విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో టెర్మినేట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న యాదమ్మ సీహెచ్‌వో సాయిబాబాను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది విధుల్లో నిరంతరం శ్రద్ధతో ఉండాలని సూచించారు. అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో నోడల్ అధికారి, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి దవాఖానను విజిట్ చేసిన సందర్భాల్లో విధుల్లో ఉన్నారా లేదా అని తెలుసుకోవడం కోసం జీపీఎస్ లొకేషన్ పెట్టాలని అడిగి తే, ఫేక్ ఫొటోస్ పెడుతూ అధికారులను పక్కదోవ పట్టించారని, దీం తో గతంలోనే రెండు మెమోలు కూడా జారీ చేశారని పేర్కొన్నారు. అ యినా నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

## పెన్సిల్ లిడ్స్‌తో రామమందిరం

- అయోధ్య నమూనాను రూపొందించిన జడ్చర్ల వాసి

జడ్చర్లటౌన్, జనవరి 19 : దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల కల అయిన అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ నేపథ్యంలో పెన్సిల్ లిడ్స్‌తో అరచేతిలో ఇమిడే రామమందిరాన్ని సంతోష్‌చారి రూపొందించాడు. ఈనెల 22న అయోధ్య ప్రారంభం నేపథ్యంలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన సంతోష్‌చారి 48 గంటలపాటు శ్రమించి ఉపవాసం ఉండి పెన్సిల్ లిడ్స్‌తో అంగులం పొడవు, 1.5 అంగులాల వెడల్పు సైజులో ఆలయ నమూనాను తయారుచేశాడు. సంతోష్‌చారిని పట్టణవాసులు అభినందిస్తున్నారు.



అయోధ్య రామమందిర నమూనాను తయారుచేస్తున్న సంతోష్‌చారి



# గురుకులం పిలుస్తోంది..

- పేదలకు వరంగా విద్యాలయాలు
- విద్యార్థుల బంగారు భవితకు బాటలు
- చేరేందుకు క్యూ కడుతున్న స్టూడెంట్స్
- 5వ తరగతి ప్రవేశాలకు 20 వరకు గడువు
- మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియ షురూ
- బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఉమ్మడి ప్రవేశ పరీక్ష
- ఐదు జిల్లాల్లో 105 సరస్వతీ నిలయాలు

వనపర్తి, జనవరి 19 : కేసీఆర్ ప్రభుత్వం నెలకొల్పిన గురుకులాలు బడుగు, బలహీన వర్గాలకు వరంగా మారాయి. ఉన్నత విద్యను అందించేందుకు గత సర్కారు కేజీ టూ పీజీ వరకు దశల వారీగా శ్రీకారం చుట్టింది. ఆ దిశలోనే రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలను, కళాశాలలను గణనీయంగా పెంచుకుంటూ వచ్చారు. వందశాతం మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో కూడా అందని స్థాయిలో విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ఆ కోవలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గురుకుల పాఠశాలలు మెరుగైన విద్యకు చిరునామాగా మారాయి. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు చూపుతున్నాయన్న నమ్మకం ప్రజల్లో పెరిగింది. అందుకే స్కూళ్లకు డిమాండ్ పెరిగి సీట్లు దక్కించుకునేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

***ప్రవేశాలకు వేళాయే..***

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతికిగానూ గురుకులాల ప్రవేశ పరీక్షకు వేళైంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం జనవరి 6వ తేదీ నుంచి అవకాశం కల్పించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలకు సంబంధించి గురుకులాలు కొనసాగుతున్నాయి. వాటిలో బాలురు, బాలికలకు కలిపి 105 పాఠశాలలు ఉన్నాయి. ఆయా చోట్ల చేరే విద్యార్థులకు వసతి కల్పించడంతో ఆంగ్లంలో బోధిస్తున్నారు. ఐదు జిల్లాల్లోని పాఠశాలల్లో బాలబాలికలకు కలిపి 6వేలకుపైగా సీట్లు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో ఒక్కో సెక్షన్ కింద 40 మంది విద్యార్థులకు, పాత గురుకుల పాఠశాలలో రెండు సెక్షన్ల కింద 80 మంది చొప్పున కేటాయించారు. ఒక్కో పాఠశాలలో 5 నుంచి పదో తరగతి వరకు 480 చొప్పున విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ-30 సాంఘిక సంక్షేమ శాఖ-35, గిరిజన సంక్షేమ-19, మైనార్టీ శాఖ-21 స్కూళ్ల చొప్పున మొత్తం 105 గురుకులాలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 40 లేదా 80 సీట్లు ఉండగా.. విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందనున్నారు.

***నిష్ణాతులచే బోధన..***

గురుకులాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాల బోధన జరుగుతున్నది. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మైనార్టీ గురుకులానికి మాత్రం ప్రత్యేక ప్రవేశ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కేవలం బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

### మెరుగైన బోధన అందిపుచ్చుకోవాలి



ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. బాలబాలికలకు వేర్వేరుగా గురుకులాలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. జనవరి 20వ తేదీతో గడువు ముగియనున్నది. బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

*- లింగయ్య, బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా కన్వీనర్*

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం..

- ప్రస్తుత విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులు.
- పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్థి సంతకం.
- విద్యార్థి చదువుతున్న పాఠశాల బోనఫైడ్.
- విద్యార్థులు 2024 సెప్టెంబర్ ఒకటి నాటికి 9-11 ఏండ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేండ్ల సడలింపు.
- గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు కాగా, పట్టణ ప్రాంతాలకు చెందిన వారైతే రూ.2 లక్షలకు మించరాదు.
- వివరాలను అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది.
- ఉమ్మడి జిల్లాలోనే పరీక్షా కేంద్రాలు.
- ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

### ప్రవేశ పరీక్ష ఇలా..

- ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తారు.
- తెలుగు, ఇంగ్లిష్, గణితం, మెంటల్ ఎబిలిటీ, పరిసరాల విజ్ఞానంలో 3, 4వ తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.
- మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది.
- తెలుగు-20, ఇంగ్లిష్-25, పరిసరాల విజ్ఞానం-20, మెంటల్ ఎబిలిటీ-10 మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- ఓఎంఆర్ షీట్‌లో జవాబులు గుర్తించాలి.
- తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్షా పత్రం.

### దరఖాస్తునకు వెబ్‌సైట్లు

- http:///tewreis.ac.in
- http:///tgegurkulam.telangana.gov.in
- http:///mjptbewreis.telangana.gov.in
- http:///tgcet.egg.gov.in

### మైనార్టీ గురుకులాల్లో ఇలా..

మైనార్టీ విద్యార్థుల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల మాదిరిగానే మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు చదివేందుకు ప్రత్యేకంగా మైనార్టీ సొసైటీ ద్వారా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నది. 5 నుంచి 8వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేయడమే గాక ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నారు.

- 5, 6, 7, 8వ తరగతులు, అలాగే కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు అవకాశం
- 5, 6, 7, 8వ తరగతుల ప్రవేశ పరీక్ష, ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఏప్రిల్ 24 తేదీ నుంచి మే 10వ తేదీ వరకు ఉంటుంది.
- కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్ష మే ఒకటో తేదీ నుంచి 10 వరకు ఉంటుంది.

### కావాల్సిన ధ్రువపత్రాలు..

- ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల బోనఫైడ్, ఫొటో.
- తెలంగాణ మైనార్టీస్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశం కోసం వెబ్ సైట్ www.tmreistelangana.cgg.gov.in

## పెరిగిన కందుల ధరలు

జడ్చర్ల, జనవరి 19 : ఈ ఏడాది కంది రైతులకు లాభాల పంట పండుతున్నది. గతానికి మించి ధరలు పలుకుతున్నాయి. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 168 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా.. క్వింటాకు గరిష్ఠంగా రూ.9,609, కనిష్ఠంగా రూ.9,209, మధ్యస్తంగా రూ.9,609 ధర వచ్చింది. 21 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం రాగా.. గరిష్ఠంగా రూ.2,856, కనిష్ఠంగా రూ.2,669, మధ్యస్తంగా రూ.2,856 ధర పలికింది. అలాగే మార్కెట్‌కు 30 క్వింటాళ్ల హంస ధాన్యం రాగా గరిష్ఠంగా రూ.1,960 ధర వచ్చింది. 3,422 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.7,611 ధర పలికింది. ఆశించిన దానికంటే అధిక ధర రావడంతో రైతన్నలు సంబురాల్లో మునిగితేలుతున్నారు.

# మాయమాటలు చెప్పి.. హత్య చేసి..

- వృద్ధురాలిహ త్యకేసులో నిందితుల గుర్తింపు
- 5.8 గ్రాముల బంగారం, 650 గ్రాముల వెండి వస్తువులుస్వా ధీనం
- మరోహ త్యకేసులోనూ హస్తం ఉన్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వెల్లడి

నాగర్‌కర్నూల్, జనవరి 19 : కల్వకుర్తి బస్టాండ్‌లో వృద్ధురాలికి మాయమాటలు చెప్పి.. వేరే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసిన అనంతరం బంగారు ఆభరణాలు కాజేసి అచ్చంపేట అడవుల్లో చంపి కాల్చివేసిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 15వ తేదీన వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు విచారణ చేస్తుండగా.. సీసీ ఫుటేజీల ఆధారంగా ఓ మహిళ, పురుషుడు హత్య చేసినట్లుగా గుర్తించారు. అనుమానితులుగా ఉన్న ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. హత్యకు గురైన కల్వకుర్తి మండలం తర్నికల్‌కు చెందిన నాగమ్మ(60).. వంగూరు మండలంలోని ఉల్పరలో ఉన్న తన కూతురు వద్దకు పండుగకు వెళ్తుండగా మాయమాటలు చెప్పి తాము ఆటోలో వదిలిపెడతామని కల్వకుర్తి బస్టాండ్ నుంచి తీసుకెళ్లినట్లు చెప్పారన్నారు. హత్యకు ఒడిగట్టిన వారిని కల్వకుర్తి పట్టణానికి చెందిన వరికుప్పల వెంకటేశ్, తెలకపల్లి మండలం వట్టిపల్లికి చెందిన కల్మూరి అలివేలగా గుర్తించినట్లు తెలిపారు. వెంకటేశ్ ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. అలివేల భర్త చనిపోవడంతో వెంకటేశ్‌తో కలిసి సహజీవనం సాగిస్తున్నారు. అదేవిధంగా ఉప్పునుంతల మండలానికి చెందిన బాలకిష్టమ్మను బల్మూర్ ప్రాంతంలో హత్య చేశామని ఒప్పుకొన్నట్లు వివరించారు. అదేవిధంగా కడ్తాల్ మండలంలో 16 గొర్రెలు, మేకలను దొంగిలించిన కేసులోనూ వీరు నిందితులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరి నుంచి మొత్తం 5.8 తులాల బంగారు, 6.5 తులాల వెండి వస్తువులతోపాటు 9 గొర్రెలను రికవరీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.4 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.



మాట్లాడుతున్ననా గర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

## బొక్కల ఫ్యాక్టరీపై ఫిర్యాదు

జడ్చర్లటౌన్, జనవరి 19 : జడ్చర్ల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బొక్కల ఫ్యాక్టరీ నిర్వహణపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో కుళ్లిపోయిన పశువుల వ్యర్థాలు, బొక్కలతో నూనె తయారు చేస్తుండగా వస్తున్న దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఫ్యాక్టరీలో బొక్కల లోడ్ డంప్ చేయడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ నుంచి బొక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని పోలీసులు కంపెనీ యజమానులను ఆదేశించినట్లు జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తెలిపారు. రోగాల వ్యాప్తికి కారణమవుతున్న ఫ్యాక్టరీని మూసివేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## "రేషన్ దుకాణాల్లో"

# బినామీలకు చెక్!

- కేటాయించిన వారే దుకాణాలు నిర్వహిస్తున్నారా..? లేదా..?
- నేటిలోగా సమగ్ర నివేదిక అందించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- ఇతరులు షాపులునిర్వ హిస్తే కేసులు
- వాస్తవ డీలర్లను సైతం తొలగించేలా చర్యలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 335 మంది డీలర్లు



రేషన్ సరుకులు అందజేస్తున్న డీలర్ (ఫైల్)

గద్వాల అర్బన్, జనవరి 19 : బినామీ రేషన్ డీలర్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ కలెక్టర్, అదనపు కలెక్టర్, పౌరసరఫరాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లాలోని 335 రేషన్ షాపులను అధికారులు తనిఖీ చేయనున్నారు. 20వ తేదీలోగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి రేషన్ షాపును క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని పేర్కొన్నారు. రేషన్ షాపు బోర్డుపై పేరున్న వ్యక్తే దుకాణం నిర్వహిస్తున్నారా..? లేక వేరే వ్యక్తి నిర్వహిస్తున్నారా..?, డీలర్ మృతి చెందిన చోట ఆయన కుటుంబ సభ్యులు కాకుండా వేరేవారెవరైనా నిర్వహిస్తున్నారా..? అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని అధికారులు రేషన్ డీలర్లకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు.

***పక్కాగా పరిశీలిస్తేనే పరివేత సాధ్యం..***

కొందరు రేషన్ డీలర్లు ఇతర పనులు చేసుకుంటుండగా, మరికొందరు పట్టణ ప్రాంతాల్లో ఉంటూ వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. మహిళలకు ఉపాధి చూపించాలనే ఉద్దేశంతో జిల్లాలో అనేక మందికి డీలర్ షాపులు మంజూరు చేశారు. దుకాణాన్ని కేటాయించిన వారే ప్రజలకు నిత్యావసర సరుకులు విక్రయించాల్సి ఉండగా, ఎక్కడా మహిళా డీలర్లు షాపుల్లో ఉంటున్న దాఖలాలు లేవు. అనేక గ్రామాల్లో యువతుల పేర్లపై రేషన్ షాపులు తీసుకున్నారు. వారు వివాహాలు చేసుకొని వెళ్లిపోవడంతో ఆయా షాపులను ఇతరులకు అప్పగించారు. అధికారులు నేరుగా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి చూడడమే కాకుండా ప్రతినెలా రేషన్‌కు ఎవరు వస్తున్నారు.? ఎవరు నడిపిస్తున్నారు.? ఈ-పాస్ యంత్రాల్లో ఎంత మంది వేలిముద్రలు మారాయి.? ఎవరి ఖాతాల్లోకి కమీషన్ డబ్బులు వెళ్తున్నాయి.? అనే అంశాలను పక్కాగా పరిశీలిస్తేనే బినామీలు ఎవరనేది తెలిసే అవకాశం ఉన్నది.

***బినామీల ఖాతాల్లో కమీషన్..***

చౌకధరల దుకాణాల్లో రేషన్ ఇచ్చేందుకు డీలర్లతోపాటు వారి కుటుంబంలో మరో ఇద్దరికి మాత్రమే ఈ-పాస్ మిషన్‌లో తంబ్ వేసే అవకాశం కల్పించారు. ఒకవేళ డీలర్ అందుబాటులో లేకుంటే ఆయన స్థానంలో వేలిముద్ర వేసి రేషన్ పంపిణీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. కానీ, కొన్ని చోట్ల రేషన్ దుకాణాల బాధ్యతలను ఇన్‌చార్జీలకు అప్పగిస్తే.. వారు బినామీలకు ముట్టజెప్పారు. తాసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వేలిముద్రలు మార్చే అధికారం ఉంటుంది. దీంతో ఎవరికి కావాలంటే వారికి వేలిముద్రలు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తున్నది. బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం క్వింటాకు రూ.140 చొప్పున డీలర్ల ఖాతాల్లో జమ చేస్తున్నది. ఇలా కొందరు బినామీ డీలర్లుగా అవతారం ఎత్తడమే కాకుండా వారి బ్యాంకు ఖాతాలను పౌరసరఫరాల శాఖ వద్ద నమోదు చేయించుకున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే కమీషన్ నేరుగా బినామీల ఖాతాల్లోనే జమవుతున్నది. కాగా, అధికారులు తనిఖీలు చేస్తున్నారనే విషయం బయటకు పొక్కడంతో సదరు డీలర్లు జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారులు పక్కాగా సర్వే చేయాల్సిన అవసరం ఉన్నది.

***సమగ్ర నివేదికను అందజేస్తాం..***



రేషన్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల తాసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశాం. బినామీ డీలర్లు ఉన్నట్లు గుర్తిస్తే అక్కడికక్కడే కేసులు నమోదు చేయాలని సూచించాం. వాస్తవ డీలర్‌ను సైతం తొలగించాలని ఆదేశించాం. 20వ తేదీలోగా సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తాం.

*- రేవతి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారిణి, జోగుళాంబ గద్వాల*